
కథ

# ప్రతీ మనిషి ఓ పుస్తకమే!



భమిడిపాటి సోమయాజి

అచ్చుమాంబ. వరలక్ష్మి ఏకగర్భజనితలు కాకపోయినా, సొంత అక్కచెల్లెళ్ల కంటే ఎక్కువ ప్రేమగా వుంటారు. వీళ్ల పుట్టిళ్లు పక్క పక్కనే వున్నాయ్. ఎక్కువగా పుట్టింట్లోనే వుంటారు. ఇద్దరికీ షష్టిపూర్తయింది కాని, వయస్సుకు తగ్గ జ్ఞానం మాత్రం రాలేదు. వీళ్లు ఒక్క నిముషం కూడా వృథా చెయ్యరు. అలా అని వుపయోగపడే ఏ పనీ మాత్రం చెయ్యరు. ఏదో విషయం మాట్లాడుతూనే వుంటారు. "ఎలకకీ, పిల్లికి జాతి వైరం ఎందుకనో?" అప్పడాల మీద ఎవరైనా పద్యాలు రాశారా అనో, యిలా నడుస్తూంటుంది వాళ్ల సంభాషణ. జంతుజాలం, పశుపక్ష్యాదులూ కనబడకపోతే, కనిపించిన ప్రతి మనిషి మీదా మాట్లాడుకుంటారు.

అచ్చుమాంబకి వచ్చిన విద్య అప్పడాలు పెట్టడం. వరలక్ష్మి సరేసరి, వడియాలు బాగా పెడుతుంది. వస్తువినిమయపద్ధతిననుసరించి, అప్పడాలూ, వడియాలూ వాయనాలు వాయనాలుగా యిచ్చి పుచ్చుకుంటూ, "బాగున్నాయ్" అంటే "బాగున్నాయ్" అని తినేసి, ఏదో ఓ అరుగు మీద కూర్చుని అందరి విషయాలూ ఆరా తీస్తూంటారు. వీళ్ల దృష్టి ఎక్కువగా, ఎదురింట్లో వున్న ఆనంద్ మీద పడుతూంటూంది.

అప్పుడే ఆఫీస్‌కి వెడుతూన్న ఆనంద్‌ని చూసిన అచ్చుమాంబ, వరలక్ష్మిని ఓ గిల్లు గిల్లి మొదలుపెట్టింది. "అసలు మనిషికి ఎంత యావ. ఈయన చూడు, శుభ్రంగా గవర్నమెంట్ వుద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. పెన్షన్ వస్తుంది. రిటైరై అయిదేళ్లయిపోయిం ది. అయినా, ప్రైవేట్ కంపెనీలో వుద్యోగం చేస్తూనే వున్నాడు. వున్న ముగ్గురు ఆడపిల్లలకీ, సర్వీస్‌లో వుండగానే, పెళ్లిళ్లు కూడా చేశేశాడు. అయినా యీయనకి సంపాదన మీదే దృష్టి. అసలు ఈయన యీ వుద్యోగం ఎందుకు చేస్తున్నాడో చాలా రోజుల్నించి నాకు అర్థమవలేదు. అసలీ రోజు సాయంకాలం, వాళ్ల యింటికెళ్లి అడుగుతానుండు" అంది వరలక్ష్మి.

"అడుగుతే అడుగు! నేనీ విషయాలు నీతో అన్నట్లు మాత్రం బయటపెట్టకు."

"నేనటువంటి దాన్ని కాదే. ఇదివరలో బోల్డుసార్లు నువ్ చాలా మంది మీద చెప్పావ్! నేనెప్పుడైనా ఆ విషయాలు బయటపెట్టానా?" అంది వరలక్ష్మి.

"లేదులే, ఎందుకైనా మంచిదని, ముందు జాగ్రత్తగా చెప్పాన్లే..."

000

ఆనంద్ యింటికి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూసిన వరలక్ష్మి, అతను రాగానే వాళ్లింటికి వెళ్లింది.

"ఏం వదినా. కులాసానా? ఈ మధ్య నువ్వు కనపడ్డం లేదు. ఓ సారి చూసి వెడదామని వచ్చాను. అన్నయ్య యింకా యింటికి రాలేదనుకుంటాను" అంది వరలక్ష్మి.

"ఏం, ఆయనతో ఏదైనా పని వుందా?" అంది శ్రీమతి ఆనంద్.

"అబ్బే! ఓసారి పలకరిద్దామని..."

ఇంతలో ఆనంద్ వచ్చి "ఏం చెల్లెమ్మా, బాగున్నారా?" అన్నాడు.

"పనీ, పాటూ లేనివాళ్లం. ఎందుకు బాగుండం? మీరైతే పొద్దున్నే ఆఫీస్‌కి వెళ్లి సాయంకాలం యింటికి వస్తారు. మీరున్నది యిద్దరే కదా, ఎందుకింత కష్టపడుతున్నారో తెలీయటం లేదు" అంది వరలక్ష్మి.

"ఉద్యోగం పురుషలక్షణం అన్నారు. కడదాకా వుద్యోగం చేసినా తప్పు లేదు. అయినా యింట్లో కూర్చుని మొగాళ్లు గోళ్లు గిల్లుకుంటూ కూర్చోలేరు కదా!" అన్నాడు ఆనంద్.

"అవును, అదీ నిజమే!" అని, వెంటనే వెళ్లిపోతే బాగుండదని కాఫీ తాగి మరీ వెళ్లింది, వరలక్ష్మి.

ఆవిడ వెళ్లిన తరువాత, "ఆ మధ్య, అన్నయ్య ఎందుకు వుద్యోగం చేస్తున్నారని, నన్ను కూడా అడిగింది" అంది, శ్రీమతి ఆనంద్.

"ఈవిడకెందుకో? శుభ్రంగా ఏ వడియాలో పెట్టుకోవచ్చు కదా!" అన్నాడు, ఆనంద్.

"వడియాలు ఒకేసారి ఎక్కువగా పెడితే బూజు కడతాయ్!" అంది శ్రీమతి ఆనంద్.

"అసలు ఎన్ని వడియాలు పెట్టినా, బూజు పట్టకుండావుంటే, యీవిడ అదే పని మీద వుండేది, మనం బ్రతికిపోయేవాళ్లం!"

ఆ రోజు రాత్రి ఆనంద్‌కి సరిగ్గా నిద్ర పట్టలేదు. ఆలోచిస్తూ పడుకున్నాడు, ఎప్పుడో తెలారకట్ట కునుకు పట్టింది.

000

ఓ రోజు సాయంకాలం ఆనంద్ ఆఫీస్ నుంచి తిరిగి వచ్చేసరికి, తన తమ్ముడి రెండో కూతురి పెళ్లి, ఫిబ్రవరి యిరవై నాలుగో తారీఖున జరుగుతున్నట్లు చెప్పింది శ్రీమతి.

అతని పెద్ద కూతురి పెళ్లికి డబ్బు సహాయం చేస్తానంటే, "వద్దు బావగారూ! అవసరమైతే రెండోదాని పెళ్లికి సహాయం చేద్దురు గాని" అన్నాడు. అతనికి ఆత్మాభిమానం ఎక్కువ. తనంతటతానై ఏదీ అడగడు. ఈ విషయం ఆనంద్ భార్య మళ్లీ ప్రస్తావించింది. "మీరొకసారి మా తమ్ముడ్ని ఏదైనా డబ్బు కావాలేమో అడగండి!" అంది.

"మరి యీ డబ్బు బాకీ తీర్చఖ్ఖర్లేదంటావా?" అంది వరలక్ష్మి.
వాళ్లని చూడ్డానికి, అప్పుడే వచ్చిన ఆనంద్, వాళ్ల మాటలు విన్నాడు. "మీరు నా బాకీ తీర్చఖ్ఖర్లేదు. నేనెందుకు వుద్యోగం చేస్తున్నానో ఆరా తీయకపోతే అదే పదివేలు నాకు! మీరొక్క విషయం తెలుసుకుంటే మంచిది. చదవాడినికి, తగినంత సమయం వుంటే ప్రతీ వ్యక్తీ ఓ పుస్తకమే" అన్నాడు ఆనంద్.

ఫోన్ చేసి అడుగుతే, ఓ ఏభై వేలు యిమ్మనీ, తన రిటైర్‌మెంట్ తరువాత వచ్చిన డబ్బుతో బాకీ తీర్చేస్తాననీ చెప్పాడు, ఆనంద్ బావమరిది.

సరేనని, ఆ డబ్బు యివ్వడానికి నిర్ణయించాడు ఆనంద్. మానవజన్మ ఎత్తిన ప్రతీవాడూ యితరుల అవసరాలు గమనించి వారికి సహాయం చెయ్యాలని నమ్మే వ్యక్తి. తన పదవీవిరమణ తరువాత కూడా, వుద్యోగం చెయ్యడానికి యిదొక కారణం. పాపం, పనీ, పాటూ లేని తన సోదరీసమానులు వరలక్ష్మి, ప్రభృతులు, తను వుద్యోగం ఎందుకు చేస్తున్నాడో తెలియక సతమతమవుతున్నారు.

ఆనంద్, చదువుకునేటప్పుడు చాలా కష్టపడ్డాడు. అతని నాన్న చిన్న వుద్యోగి. కుటుంబం కూడా పెద్దది. క్లాసులు మొదలైన రెండు నెలలకు కాని పాఠ్యపుస్తకాలు కొనుక్కోలేని పరిస్థితి. ఓ సారి రాస్తే, పదిసార్లు చదివినట్లు అవుతుంది అని తమ పెద్దవాళ్లు చెప్పేవారు. పాఠ్యపుస్తకాలు కొనుక్కునేవరకూ, తన స్నేహితుల పుస్తకాలు తీసుకుని రాసుకునేవాడు. బాగా చదువు రావడానికే కాబోలు, దేవుడు పాఠ్యపుస్తకాలు కొనుక్కునే ఆర్థికస్తోమత యివ్వలేదనుకునేవాడు.

పెద్దవాడైన తరువాత కూడా, చదువు విషయంలో తను పడిన కష్టాలు మరచిపోలేదు. అందుకే బీద విద్యార్థులకి నెలకింత ధన సహాయం చేస్తున్నాడు. తను యిప్పటికి కూడా వుద్యోగం చెయ్యడానికి యిదొక కారణం. అసలు తనింకా వుద్యోగం చేస్తే, యితరులకెందుకో ఆనంద్‌కి అర్థం కాదు.

తనకు ఓ పక్క చదువు చెప్పిస్తూనే, ఎదిగిన తన అక్క పెళ్లి చెయ్యడానికి ఆనంద్ తండ్రి ఎంత కష్టపడ్డాడో యిప్పటికీ మరచిపోలేదతను. ఎవరైన తనకి తెలుసున్నవాళ్లు తగిన స్తోమత లేకుండా ఆడపిల్ల పెళ్లి చేస్తూంటే, వారు అడగకుండానే, శక్తి కొద్దీ, సహాయం చేస్తూంటాడు. ఆనంద్ పదవీవిరమణ చేసిన తరువాత కూడా వుద్యోగం చెయ్యడానికి యిదొక కారణం, భోజనంతో, అప్పడాలూ, వడియాలూ జోడించి రుచిగా తినే అచ్చమాంబకీ, వరలక్ష్మికీ, యీ విషయాలేమర్థమవుతాయ్?

ఇలా రకరకాలుగా ఎంతోమందికి సహాయాలు చేస్తున్నాడు, ఆనంద్.

ఈ విషయాలు తెలియని అచ్చమాంబా, వరలక్ష్మీ మాత్రం ఎందుకు వుద్యోగం చేస్తున్నాడో, యిప్పటికి ఎంత డబ్బు కూడా పెట్టాడో తెలియక మథనపడుతూనే వున్నారు, పాపం!

000

ఓ సారి ఆటోలో వెళుతుండగా, ఆ ఆటోని ఓ బస్సు ఢీ కొట్టింది. "ఆటో, బస్సు ఢీ" అని పేపర్లో వచ్చింది. ఇద్దరు ఆడవాళ్లకి ఒక ఎడమ కాలూ, ఓ ఎడమ చెయ్యీ విరిగాయని కూడా ఆ పేపర్లో వేశారు. కాలు విరిగింది అచ్చమాంబకీ, ఎడమ చేయి విరిగింది వరలక్ష్మికీ. చాలామంది వాళ్లని హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. కొంత మందైతే అదృష్టం, కుడి చెయ్యి విరగ కపోవడం అన్నారు.

ఈ విరిగిన అవయవాలు అచ్చమాంబ, వరలక్ష్ములవే అని భార్య ద్వారా తెలుసుకున్న ఆనంద్, సతీసమేతంగా హాస్పిటల్‌కి వెళ్లి వాళ్లని ఓదార్చాడు. వైద్యానికి వాళ్ల దగ్గర తగినంత డబ్బు లేదని తెలుసుకుని, ఓ పాతిక వేలు వాళ్లకిచ్చాడు. వాళ్లు పరమానందపడ్డారు.

హాస్పిటల్లో వున్నారు. అప్పడాలూ, వడియాలూ పెడదామంటే వీల్లేని పరిస్థితి. వీళ్ల సంగతి గమనించిన వైద్యులు, వీళ్లని హాస్పిటల్లో నిశ్శబ్దంగా వుండాలనీ, మరీ ఏం తోచనప్పుడు ఓ పది నిమిషాలు పనికొచ్చే విషయాలేమైనా ప్రస్తావించుకోమనీ, చెప్పారు.

వైద్యం సరిగ్గా చేయ్యకపోతే, శాశ్వత అంగవైకల్యం ఏర్పడుతుందన్న భయంతో, డాక్టర్లు చెప్పిన పది నిమిషాల్ని అయిదు నిమిషాలకి కుదించి మాట్లాడుకుంటున్నారు, ఈ మహిళాద్వయం.

ఓ సారి, ఆ అయిదు నిమిషాల్లోనే "ఆ ఆనంద్ గారు ఎందుకు వుద్యోగం చేస్తున్నారో అని సతమతమైపోయాం మనం. అసలు ఆయన మనలాగా ఆర్థికంగా యిబ్బందుల్లో వున్నవారిలో ఎంత మందికి సహాయం చేస్తున్నారో! మంచి వడియాలూ, అప్పడాలూ తయారుచేసి ఆయనకిచ్చి ఆయన ఋణం తీర్చుకోవాలి!" అంది అచ్చమాంబ.

"మరి యీ డబ్బు బాకీ తీర్చఖ్ఖర్లేదంటావా?" అంది వరలక్ష్మి.

వాళ్లని చూడ్డానికి, అప్పుడే వచ్చిన ఆనంద్, వాళ్ల మాటలు విన్నాడు. "మీరు నా బాకీ తీర్చఖ్ఖర్లేదు. నేనెందుకు వుద్యోగం చేస్తున్నానో ఆరా తీయకపోతే అదే పదివేలు నాకు! మీరొక్క విషయం తెలుసుకుంటే మంచిది. చదవాడినికి, తగినంత సమయం వుంటే ప్రతీ వ్యక్తీ ఓ పుస్తకమే" అన్నాడు ఆనంద్.

అసలు వరలక్ష్మికీ, అచ్చమాంబకీ చదువన్నా, పుస్తకాలన్నా చిన్నప్పట్నుంచీ చచ్చేటంత భయం. అక్షరాభ్యాసం రోజునే పలకా, బలపం, వాళ్ల వూళ్లో వున్న చెరువులో నిమజ్జనం చేసిన నిపుణులు. పాపం! యిన్నాళ్లూ ప్రతీ మనిషీ ఓ పుస్తకం అని తెలియక, మనుషుల గురించీ, వుబలాటపడ్డారు. ఆనంద్ చెప్పింది తెలుసుకున్న తరువాత చుట్టూ వున్న మనుషుల విషయాల్లో కలగచేసుకోవడం మానేశారు. ●